క్లుప్తంగా

కలెక్టర్ చెప్పినా డ్రైన్ వేయరా?



డిజిటల్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

లేపాక్షి: కల్లూరులో డ్రైన్‌లు ఏర్పాటు చేయమని కలెక్టర్ చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని కల్లూరు ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం వచ్చిందంటే డ్రైన్‌లు లేక వర్షపు నీరు ఇళ్లలోకి వస్తోందన్నారు. కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోగా ఆయన డ్రైన్‌లు ఏర్పాటు చేయమని ఆదేశించారన్నారు. అయితే డ్రైన్‌ల నిర్మాణం కోసం నిధులు మంజూరైనా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే డ్రైన్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందించారు.

జీఎస్టీపై అవగాహన



మేళాను ప్రారంభిస్తున్న ఆర్టీఓ కరుణసాగర్‌రెడ్డి

హిందూపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వాహనాల కొనుగోళ్లపై పన్నుల భారం తగ్గించి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేశారని ఆర్టీఓ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. ఏపీ రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం హిందుపురంలోని సీఅండ్ ఐజీ చర్చి గ్రౌండ్‌లో వాహన డీలర్ల సహకారంతో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్ వెహికల్ మేళా కార్యక్రమాన్ని ఆర్టీఓ ప్రారంభించారు. వాహనాలపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించడంతో వాహన ధరలు చాలా వరకు తగ్గిపోయాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రపంచ ఆహార దినోత్సవం

పెనుకొండ: ఆకలికేకలు ఆపడం అందరి బాధ్యతని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప, ఎంఈఓ రాఘవయ్య పేర్కొన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల, సత్యసాయి డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ ఆదిశేషారెడ్డి, ఏఓ కేశవయ్య, అధ్యాపకులు రామన్న, యశోధారాణి, నింగప్ప, నగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



నేత్రదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: వివేకానంద యోగ థెరపీ ఇన్‌స్టిట్యూట్ యోగా మాస్టర్ మాకం బాలాజీ కుమార్ సతీమణి సునీత (50) గురువారం మరణించారు. ఆమె కళ్ళను శ్రీనివాస ఫౌండేషన్ హిందూపురం జయంతి డాక్టర్ సంధ్యాలక్ష్మి, ద్వారకనాథ్ ఆధ్వర్యంలో సేకరించి వాటిని బెంగళూరు రాజకుమార్ ఐ బ్యాంక్‌కు దానంగా అందజేశారు. కార్యక్రమం వివేకానంద యోగా ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బదిరి నారాయణ, సహ కార్యదర్శి కరే రమేష్, సభ్యులు దేవాంగం శంకరప్ప పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న మగ్గాల యాజమానులు, కార్మికులు

హిందూపురం: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి, దండురోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు లో ఓల్టేజ్ సమస్యతో సతమతం అవుతున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ముదిరెడ్డిపల్లి ట్రాన్స్‌కో సెక్షన్ ఆఫీసు వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. సుమారు మూడు నెలల నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు ఎక్కువై హ్యాండ్లూమ్, పవర్ లూమ్ మగ్గాలు నిర్వాహకులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే నాణ్యమైన ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు అదనపు తీగలు లాగి విద్యుత్ సమస్య లేకుండా చూడాలని కోరారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందించారు.

నూతన కమిటీ ఎంపిక

హిందూపురం టౌన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హిందూపురం నూతన నగర కార్యవర్గాన్ని గురువారం పట్టణంలో ఎన్నుకున్నారు. నగర కార్యదర్శిగా మహేంద్ర, ఉపాధ్యక్షుడిగా నవతేజ్, సంయుక్త కార్యదర్శిగా అర్జున్, ఖేలో భారత్ కన్వీనర్‌గా వెంకటేష్, హాస్టల్స్ కన్వీనర్‌గా పవన్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా రాంప్రసాద్ పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

పారిశ్రామికాభివృద్ధి ఎక్కడ బాలయ్యా?





పారిశ్రామికవాడలో పరిశ్రమలకు వెళ్లే రహదారి దుస్థితి



గోళాపురం వైపు పరిశ్రమలకు వెళ్లే దారి ఇలా..

హిందూపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే హిందూపురం ప్రాంతం పరిశ్రమలకు పెట్టింది పేరు. ఇక్కడ దాదాపుగా 185కు పైగా పరిశ్రమలు ఉంటాయి. ఇందులో 20 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఇంత ప్రాధాన్యత ఉన్న హిందూపురం పరిధిలోని పారిశ్రామికవాడలో మాత్రం అభివృద్ధి పడకేసింది. మరీ ముఖ్యంగా నిత్యం ఇక్కడ వందల వాహనాలు తిరుగుతుంటాయి. పరిశ్రమల కేంద్రమైన తూమకుంట, గోళాపురం ప్రధాన రహదారులు అధ్వానంగా ఉండటంతో వాహనదారులతో పాటు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నియోజకవర్గం నుంచి వరుసగా టీడీపీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నా పారిశ్రామికాభివృద్ధిని మాత్రం విస్మరిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే బాలకృష్ణ రెండోసారి కూడా ఎమ్మెల్యేగా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా ఎనాడూ తమ బాగోగులను పట్టించుకున్నపాపాన పోలేదని కార్మికులు వాపోతున్నారు. వర్షం వస్తే ఎటూ చూసినా రోడ్లపై నీటిమడుగులా నీరునిలిచి ఉంటుంది. వాహనాదారులు ఏగోతిలో పడతారో తెలియని దుస్థితి నెలకొంది. కనీసం ఇప్పటికైనా పారిశ్రామిక వాడపై దృష్టిసారించి మౌలిక వసతులు కల్పించాలని కార్మికులు, వివిధ పరిశ్రమల యజమానులు కోరుతున్నారు.



గుంతలమయంగా తూమకుంటలోని రోడ్డు



అధ్వానస్థితిలో పారిశ్రామికవాడకు వెళ్లే ప్రధాన రహదారి



తూమకుంట ప్రధాన రహదారి పక్కన ఉన్న చెత్తాచెదారం

చంద్రబాబును ప్రజలు క్షమించరు

- హామీలిచ్చి, సంక్షేమ పథకాలు గాలికి వదిలేస్తారా?
- ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు (లేపాక్షి): 'సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు గాలికి వదిలేశారు. ఆయన్ను ప్రజలు ఎప్పటికీ క్షమించరు. తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు' అని చెబుతారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. లేపాక్షి మండలంలోని నాయనపల్లి పంచాయతీ ఉప్పరపల్లిలో ఆమె రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు నిరిర్వరామంగా అందించారని గుర్తుచేశారు. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అబద్ధాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పేదలతో బలవంతంగా భూములు లాక్కొంటున్నారని, ప్రభుత్వం నిర్మించి నిర్వహించాల్సిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా సొంత జేబులు నింపుకోవడానికే తప్ప ప్రజలకు మేలు చేసేందుకు మాత్రం కాదని స్పష్టం చేశారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, బీసీలకు 50 ఏళ్లు నిండితే పెన్షన్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను పట్టించుకోకపోవడం చూస్తుంటే వారు దొడ్డిదారిన అధికారంలోకి వచ్చారేమోనన్న అనుమానం కలుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి మోసాలను ప్రజలకు వివరించాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సయ్యద్ నిస్సార్, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు శ్యామప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, బూత్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు హనూక్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బోయ రామాంజి, మల్లన్న, చలపతి, విజయ్, శేషాద్రిరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, తిప్పన్న, మూర్తి, రామాంజి, అన్సర్, చందు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీ.నరసాపురంలో కోటి సంతకాల సేకరణ

పరిగి: మండలంలోని పీ నరసాపురంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ నేతృత్వంలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో ప్రజల నుంచి కోటి సంతకాల సేకరణను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

19న అమరాపురంలో...

అమరాపురం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 19న స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప కార్యక్రమానికి హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

హిందూపురం: కర్నూలులో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వన్నేరువప్ప, కార్యదర్శి రామచంద్రప్ప డిమాండ్ చేశారు. గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం నుంచి ర్యాలీగా పట్టణ పురవీధుల గుండా కొనసాగుతూ స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని ముక్తకంఠంతో నినదించారు. న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, రాజశేఖర్, నాగరాజు రెడ్డి, సుదర్శన్, సిద్దు, ఇందాద్, శ్రీరాములు, మనోహర్ రెడ్డి, కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జన్ సమర్థ్ పోర్టల్‌పై అవగాహన

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయంలోని సమావేశ భవనంలో గురువారం ఎంపీడీఓ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో జన్ సమర్థ్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆర్‌బీఐ సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్ రమేష్, మోహన్‌కుమార్ తదితరులు జన్ సమర్థ్ పోర్టల్, పీఎంజీపీ, ముద్ర, సూర్యఘర్ రుణాలపై వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం రామచంద్రారెడ్డి, ఏఓ ఆజేష్, ఏఈ జయంద్ర, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్వరలోనే వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకులు

పావగడ: పట్టణంలో త్వరలోనే మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట జరగనుంది. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో తయారు చేసిన విగ్రహాన్ని గురువారం మధ్యాహ్నం పావగడకు తీసుకొచ్చారు. రొప్పం గ్రామం మారెమ్మ దేవాలయం నుంచి వాల్మీకి విగ్రహాన్ని స్థానిక వాల్మీకి సంఘం నాయకులు బైక్ ర్యాలీ, భారీ ఊరేగింపు మధ్య కుమారస్వామి లేఅవుట్‌లోని వాల్మీకి దేవాలయం వద్దకు చేర్చారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ సమీపంలో రెండు రోజుల్లో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మరణించారు. వారి వివరాల కోసం ప్రయత్నించినా తెలియకపోవడంతో వన్ టౌన్ పోలీసుల సమాచారంతో యుగంధర్ మిత్ర బృందం కలిసి అనాథ శవాలకు అంత్యక్రియలు చేశారు.

బస్సుల్లేక ప్రయాణికుల అగచాట్లు

మడకశిర: నియోజకవర్గవ్యాప్తంగా గురువారం రెండోరోజూ కూడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు నానా అగచాట్లు పడ్డారు. గురువారం కర్నూలులో జరిగిన ప్రధాన మంత్రి సభకు మడకశిర డిపో పరిధిలోని బస్సులను కేటాయించడంతో బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా పల్లె వెలుగు బసులన్నీ కేటాయించడంతో గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. మడకశిర నుంచి అమరాపురం, రొళ్ల, గుడిబండ, అగళి మండలాలకు ఒక్క బస్సు కూడా లేక పోవడంతో ప్రయాణికులు అవస్థ పడ్డారు. రెండోరోజూ కూడా ప్రయాణికులు తమ గమ్య స్థానాలను చేరుకోవడానికి ప్రైవేట్ బస్సులు, ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రక్తదానం .. ప్రాణదానం

హిందూపురం: ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందించి ప్రాణాలు కాపాడితే దైవంగా నిలుస్తారని సూర్య ఫౌండేషన్ సభ్యులు శశాంక్, వేణుగోపాల్ తెలిపారు. హిందూపురం ఆస్పత్రి సూపరింటెండెంట్, బ్లడ్‌సెంటర్ సహకారంతో గురువారం తూమకుంట పారిశ్రామిక కేంద్రం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 35 మంది కార్మికులు రక్తదానం చేశారు.

స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

రొళ్ల: వివిధ పథకాల ద్వారా ప్రభుత్వ భూముల్లో దళితులకు కేటాయించిన ఇంటి నివేశ స్థలాలను ఆక్రమించుకొంటే పోలీస్‌శాఖ ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్ షేక్షావలి హెచ్చరించారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పెత్తందారులు తమ పలుకు పడిని ఉపయోగించి నిరుపేద దళితుల కోసం కేటాయించిన ఇంటి నివేశన స్థలాలను ఆక్రమించుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా దళితులకు కేటాయించిన ఇంటి నివేశ స్థలాల జోలికి వెళ్లొద్దని తెలిపారు.

ఆర్ఐగా బాధ్యతల స్వీకరణ

గుడిబండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆర్ఐగా నేలకోటప్ప బాధ్యతలు స్వీకరించారు. రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని పేర్కొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలో విరివిగా మొక్కలు నాటడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు తెలిపారు. వారు గురువారం పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మేరిసియోన్‌కుమారి, మెప్మా సీఓ నాగేశ్వరి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అమరాపురం: స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో గురువారం ఎస్ఐ ఇషాక్‌బాషా ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులు పక్కగా ఉండాలని ఎస్ఐ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

బీరువాల వితరణ

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు కూడేరు మండలం మరుట్లకు చెందిన షణ్ముఖరెడ్డి గురువారం బీరువాలు వితరణ చేశారు. జేజమ్మ యల్లమ్మ జ్ఞాపకార్థం ఆయన బీరువాలు ఉపాధ్యాయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణస్వామి, ఉపాధ్యాయులు గిరిజమ్మ, భారతి, కరుణకుమారి, రేష్మాభాను, ఆనందమ్మ, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

పావగడ: పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న నందిని పార్లర్‌లో మాజీ మంత్రి వెంకటరమణప్ప ఫొటో ఏర్పాటుపై ఇటీవల జరిగిన ఘర్షణ సంఘటనలో పార్లర్ నిర్వాహకుడు శ్రీరామప్ప ఫిర్యాదు మేరకు జేడీఎస్ నాయకులు గంగాధర్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ మను మహేశ్‌పై స్థానిక పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మధుగిరి డీఎస్పీ మంజునాథ్ గురువారం సాయంత్రం పార్లర్‌ను పరిశీలించి నిర్వాహకుడు శ్రీరామప్పతో వివరాలు సేకరించారు. వీరితో పాటు మరో నలుగురు జేడీఎస్ నాయకులపై కూడా కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

తప్పిన ప్రమాదం



తమ్మడేపల్లికి వెళ్లే రహదారిలో పైకి లేచిన ఆటో

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లికి వెళ్లే రహదారిలో ప్రమాదం తప్పింది. గురువారం అమరాపురం నుంచి లగేజీ ఆటో విరుపసముద్రం వైపు వెళ్తోంది. అయితే తమ్మడేపల్లి – అమరాపురం మార్గ మధ్యలో అధిక లోడుతో పాటు రోడ్డుపై గుంతల కారణంగా ఆటో ఒక్కసారిగా పైకి లేచింది. డ్రైవర్ చాకచక్యంగా ఆటోను కిందికి దింపడంతో ప్రమాదం తప్పింది. లగేజీని దింపిన తర్వాత ఆటోను తీసుకెళ్లారు. డ్రైవర్‌తో పాటు మరోవ్యక్తి సురక్షితంగా బయట పడ్డారు.

యువతి అదృశ్యం

రొద్దం: మండల పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన దేవి (20) అనే యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కాంతప్ప తెలిపారు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్న ఆమె తల్లి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



రామప్ప (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట కాలనీ సమీపంలో ఈనెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో రామప్ప (62) తీవ్రంగా పడిన విషయం తెలిసిందే. రొళ్ల నుంచి మడకశిర వైపు వెళ్తున్న కారు నడిచి వెళ్తున్న రామప్పను ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. అయితే బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రామప్ప మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య సుందరమ్మ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వసంత్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఇదాయతుల్లా తెలిపారు.

అనుమతి కోసం టపాకాయల వ్యాపారుల ఎదురుచూపు

మడకశిర: పట్టణంలో టపాకాయల విక్రయానికి ఇంత వరకూ సంబంధిత అధికారులు వ్యాపారులకు అనుమతి మంజూరు చేయలేదు. దీంతో టపాకాయల వ్యాపారులు అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు. అనుమతుల కోసం ఆరుగురు వ్యాపారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 19, 20న దీపావళి పండుగను ప్రజలు జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు పరిశీలించి టపాకాయల వ్యాపారానికి అనుమతి మంజూరు చేయాల్సి ఉంది. ఇంత వరకూ అనుమతులు రాకపోవడంతో వ్యాపారులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

వైభవంగా యత్తప్పస్వామి క్షీరోత్సవం



కల్లంలో పూజ చేస్తున్న దృశ్యం



పాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న యాదవులు



అలంకరణలో యత్తప్పస్వామి

రొళ్ల: మండల పరిధిలోని గంతికల్లు గొల్లహట్టి గ్రామంలో వెలసిన యాదవుల ఆరాధ్య దైవం యత్తప్పస్వామి ఉత్సవంలో భాగంగా గురువారం క్షీరోత్సవం (పాలు పోసే పండగ)ను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే నియమనిష్టలతో గొర్రెలు, ఆవుల కల్లం వద్దకు ఊరేగింపుగా వెళ్లి స్వామి ప్రతిమను కల్లంలో తయారు చేసి పాలతో ప్రతిమకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం డప్పు వాయిద్యాలతో ఆలయం వద్దకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి తీసుకుచ్చిన పాలతో స్వామిని అభిషేకించారు. తర్వాత యత్తప్పస్వామి, చిత్రలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు దీపాన్ని చేతిలో పట్టుకుని ఆలయ ప్రాంగణం చుట్టూ నృత్యమాడుతు ప్రదక్షిణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది.